సాక్షి జగిత్యాల

శుక్రవారం : 12 : మే : 2023



ఆలయాల్లో మంత్రి పూజలు

వెల్గటూర్: మండలంలోని కప్పారావుపేటలో పెద్దమ్మతల్లి బోనాల కార్యక్రమంలో మంత్రి ఈశ్వర్ పాల్గొన్నారు. వెంకటాపూర్ అభయాంజనేయస్వామి ఆలయంలో పూజలు చేశారు.



అంజన్న సేవలో శివసేనారెడ్డి

మల్యాల: కొండగట్టు ఆంజనేయస్వామిని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డి గురువారం దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం 40.0/26.0

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. పగలు ఎండగా, ఉక్కపోతగా ఉంటుంది. చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

తరుగు పేరిట దోపిడీ

- తొలుత కొనుగోలు కేంద్రాల్లో, తరువాత మిల్లుల్లో చేతివాటం
- తేమ, గడ్డి, మట్టిబెడ్డల పేరుతో 2 కిలోలు తరుగు
- అదే కారణంతో మిల్లులలో మరోసారి ధాన్యం కోత
- క్వింటాలుకు తొమ్మిది కిలోలకుపైగా వడ్లకు కన్నం
- కొనుగోలు కేంద్రం నిర్వాహకులు, మిల్లర్లు కుమ్మక్కు?



సారంగాపూర్ మండలం బట్టపల్లిలో ధాన్యం కొనుగోళ్లు

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: వడగండ్ల గండాలు దాటి మిగిలిన పంటను కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చిన రైతులు రకరకాలుగా దోపిడీకి గురవుతున్నారు. కోతల పేరుతో మిల్లర్లంతా ఏటా రూ.వందల కోట్ల దందా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా చేస్తున్న విషయం తెలిసిందే. మొన్నటి దాకా అకాల వర్షాలు, వడగండ్లతో చాలావరకు పంటనష్టం జరిగింది. చివరికి చేతికి వచ్చిన పంటను కొనుగోలు కేంద్రాలకు తీసుకువస్తే.. తేమ, గడ్డి, తాలు ఉందంటూ రకరకాల కారణాలు చెప్పి రెండు కిలోల మేర తరుగు తీస్తున్నారు. వాస్తవానికి 40.600 కిలోల బస్తా కోసం 650 గ్రాముల (సంచి బరువు)కు మించి తరుగు తీయవద్దన్న నిబంధనను ఉమ్మడి జిల్లాలో ఎవరూ పెద్దగా పట్టించుకోవడం లేదు. కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు–మిల్లర్లు కలిసే ఈ దందా చేస్తున్నారని అన్నదాతలు మండిపడుతున్నారు.

క్వింటాలుకు ఎనిమిది కిలోలు..!

ప్రస్తుతం కొనుగోలు కేంద్రాల్లో తేమ సాకుతో చాలామంది మిల్లర్లు కొర్రీలు పెడుతున్నారు. అకాల వర్షాలు, వడగండ్ల కారణంగా చాలా చోట్ల కొనుగోలు కేంద్రాల్లో ఆరబోసిన ధాన్యం కుప్పలు తడిసిన విషయం తెలిసిందే. గత వంద ఏళ్లలో ఎన్నడూ చూడని విపత్తును ఇటీవల రైతులు ఎదుర్కొన్నారు. కల్లాల్లోని ధాన్యం ఇంకా ఆరనే లేదు. 20శాతం వరకు తేమ ఉన్నా కొంటామని ప్రభుత్వం చెప్పినా.. క్షేత్రస్థాయిలో ఈ నిబంధన ఉల్లంఘనకు గురవుతోంది. తేమతోపాటు వరి ధాన్యంలో మట్టిబెడ్డలు, గడ్డి, తాలూ ఉన్నాయంటూ సాకులు చెబుతూ.. కొనుగోలు కేంద్రంలో బస్తాకు రెండు కిలోలు తరుగు తీస్తున్నారు. అనంతరం మిల్లుకు వెళ్లిన ధాన్యం తూకం ఎంట్రీ చేసే సమయంలో మరో రెండు కిలోల చొప్పున కోత పెడుతున్నారు. మొత్తంగా క్వింటాలుకు రెండు నుంచి తొమ్మిది కిలోల చొప్పున ధాన్యం తరుగు తీస్తున్నారు. ఇదేం అన్యాయమని నిలదీసిన రైతుల ధాన్యం కొనమని తెగేసి చెబుతున్నారు.

పెద్దపల్లిలో ప్రారంభం కాని కొనుగోళ్లు..

సిరిసిల్ల, జగిత్యాల, కరీంనగర్‌లో తరుగు మోసాలు నడుస్తుంటే పెద్దపల్లిలో మాత్రం కథ మరోలా ఉంది. జిల్లాలో ప్రభుత్వం 300 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి, వాటి ద్వారా సుమారు 4 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని నిర్ణయించింది. కానీ.. క్షేత్రస్థాయిలో కొనుగోళ్లు నత్తనడకన కొనసాగుతున్నాయి. ఇప్పటివరకు కేవలం 62,245 మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే కొనుగోలు చేశారు. క్వింటాకు 6 నుంచి 7 కిలోల తరుగుకు ఒప్పుకుంటేనే కొనుగోలు చేస్తున్నారని అన్నదాతలు వాపోతున్నారు. తరుగు లేకుండా మిల్లర్స్‌కు తరలించిన ధాన్యాన్ని మిల్లర్లు దించుకోవడం లేదు.

జిల్లా	సాగు (ఎకరాల్లో)	దిగుబడి అంచనా (మె.టన్నుల్లో)
కరీంనగర్	2,71,388	7.5 లక్షలు
పెద్దపల్లి	2,00,033	4 లక్షలు
జగిత్యాల	2,97,638	7 లక్షలు
సిరిసిల్ల	1,71,008	3 లక్షలు

నెలరోజులుగా కేంద్రాల్లోనే..



మాకు ఉన్న పొలంతోపాటు 8 ఎకరాలు కౌలుకు తీసుకొని వరి సాగు చేశాం. చేతికొచ్చిన పంటను నెలరోజుల క్రితం సెంటర్‌కు తీసుకొచ్చి ఆరబోసినం. వర్షాలు పడుతుండటంతో సద్ది తెచ్చుకొని ఇక్కడే తింటూ ధాన్యం తడవకుండా కాపాలకాస్తున్నాం. తేమ, తాలు పేరుతో తరుగు పెడుతున్నారు. వచ్చినకాడికి అమ్ముకుందామన్నా మిల్లర్లు ధాన్యం దించుకోవటం లేదని కాంటాలు పెట్టడం లేదు.

– బాలసాని రాజమణి, సుద్దాల

రెండున్నర కిలోలు అధికం



నాకు నాలుగెకరాల వ్యవసాయ పొలం ఉంది. ఆ భూమిలో దాదాపు 58 క్వింటాళ్ల వడ్లు అయ్యాయి. వాస్తవానికి ప్రతీసారి 120 క్వింటాళ్ల దిగుబడి వచ్చేది. కానీ.. ఈసారి వడగళ్లు, అకాల వర్షాల కారణంగా దిగుబడి పడిపోయింది. తేమ 17శాతం ఉంటేనే కొంటున్నారు. మా వద్ద బస్తాను 40 కిలోలకు రెండున్నర కిలోలు అదనంగా తూకం వేస్తున్నారు.

– మాదుగుల లింబాద్రి, సిరిసిల్ల

కోతలు పెడితే మిగిలేదేంటి



రెండున్నర ఎకరాల్లో వరి వేస్తే వచ్చిన దిగుబడే తక్కువ. 70 క్వింటాళ్ల ధాన్యం వస్తదనుకుంటే మాయదారి వానతో సగం కూడా రాలేదు. ఇప్పుడు అమ్మితే బస్తాకు 2 కిలోలు కోత పెడుతున్నారు. ఇదెక్కడి న్యాయం. ఈసారి వానలతోటి నష్టపోయినం. ఇప్పుడు కొనుగోలు కేంద్రాలల్ల నష్టపోతున్నం.

– లక్ష్మి, గంగాధర

చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

- ఎస్పీ ఎగ్గడి భాస్కర్

జగిత్యాలక్రైం: జిల్లాలో పోలీస్ యాక్ట్ అమలులో ఉండగా చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని ఎస్పీ ఎగ్గడి భాస్కర్ అన్నారు. గురువారం విలేకరులతో మాట్లాడారు. జగిత్యాల బస్ డిపో వద్ద ఆర్టీసీ బస్సులో జరిగిన ఘటనపై పట్టణ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసి నిష్పక్షపాతంగా విచారణ జరుపుతున్నామని పేర్కొన్నారు. విచారణలో ఉండగానే జగిత్యాల రూరల్ ఎస్సై అనిల్‌ను ఉన్నతాధికారులు గురువారం సస్పెండ్ చేయడం జరిగిందన్నారు. చట్టవ్యతిరేకంగా ఎవరైనా ప్రవర్తిస్తే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. బుధవారం జిల్లాలోని జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి, రాయికల్ పట్టణా ల్లో పోలీస్‌యాక్ట్ అమలును ఉల్లంఘించి ప్రజాజీవనానికి భంగం కలిగిస్తూ ధర్నాలు చేసిన వారిపై ఆరు కేసులు నమోదు చేయడం జరిగిందన్నారు. వీరందరిపై విచారణ జరిపి చట్టప్రకారం చర్యలు తీసుకోనున్నట్లు వివరించారు. శాంతిభద్రతల పరిరక్షణకు నిరంతరం శ్రమిస్తున్న జిల్లా పోలీసులకు అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని ఎస్పీ కోరారు.



మాట్లాడుతున్న ఎస్పీ భాస్కర్

ప్రజా సమస్యల పరిష్కారంలో అలసత్వం వద్దు

వెల్గటూర్(ధర్మపురి): ప్రజా సమస్యల పరిష్కారంలో పోలీసులు అలసత్వం వహించొద్దని, ప్రజల ఫిర్యాదులకు తక్షణం స్పందించి పరిష్కరించాలని ఎస్పీ భాస్కర్ అన్నారు. గురువారం వెల్గటూర్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి సిబ్బంది వివరాలు, నిర్వహిస్తున్న విధుల గురించి ప్రత్యేకంగా అడిగి తెలుసుకున్నారు. తమకు కేటాయించి గ్రామాలకు సంబంధించి పూర్తి సమాచారం సిబ్బంది వద్ద ఉండాలని, పోలీస్ స్టేషన్ పరిధిలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చూడాలన్నారు. గ్రామాల్లో శాంతి భద్రతలు అదుపులో ఉంచడానికి పోలీసులు విధులను సక్రమంగా నిర్వహించాలని, రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ధర్మపురి సీఐ బిల్ల కోటేశ్వర్, ఎస్సై నరేశ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు చేయాలని రైతుల ఆందోళన



చిల్వాకోడూర్ చౌరస్తా వద్ద ధర్నా చేస్తున్న రైతులు

గొల్లపల్లి(ధర్మపురి): మండలంలోని దట్నూర్ గ్రామానికి చెందిన రైతులు చిల్వాకోడూర్ చౌరస్తా వద్ద రహదారిపై ఆందోళనకు దిగారు. గ్రామంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో ధాన్యం కొనడం లేదని నిరసన చేపట్టారు. ఇప్పటికే అకాల వర్షాలతో నష్టపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ధాన్యం కొనాలని డిమాండ్ చేశారు. రాస్తారోకోతో భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది. పోలీసులు రంగంలోకి దిగి పీఏసీఎస్ సిబ్బందితో మాట్లాడి రైతులను శాంతింపజేశారు.

పంచాయతీ సిబ్బంది సమ్మె విరమణ

ఇబ్రహీంపట్నం(కోరుట్ల): ప్రభుత్వం తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతు మండలంలోని గ్రామపంచాయతీల్లో పనిచేస్తున్న కారోబార్లు, బిల్ కలెక్టర్లు, పారిశుధ్య సిబ్బంది 7 రోజులుగా మండల పరిషత్ కార్యాలయం ఎదుట సమ్మె చేశారు. పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు రాష్ట్ర కమిటీ నాయకులతో పంచాయతీ కార్మికుల న్యాయమైన సమస్యలపై సానుకూలంగా స్పందించి, త్వరలోనే సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో సమ్మెను తాత్కాలికంగా విరమించారు. గురువారం మండలపరిషత్ కార్యాలయం వద్ద సీనియర్ అసిస్టెంట్ రాంప్రసాద్‌కు సమ్మె విరమిస్తున్నట్లు కార్మికులు విన్నవించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్మికుల నాయకులు నీరేటి రతన్, జె.నరేష్, బి.గంగాధర్, టి.గంగారం తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ పెద్ద జయంతికి సర్వం సిద్ధం

- ముస్తాబైన కొండగట్టు
- నేటి నుంచి మూడు రోజుల పాటు వేడుకలు

జగిత్యాల: హనుమాన్ పెద్ద జయంతి ఉత్సవాలకు కొండగట్టు అంజన్న ఆలయం ముస్తాబైంది. ఈనెల 12 నుంచి 15 వరకు ఉత్సవాలు జరుగనున్నాయి. అంజన్న ఆలయంతో పాటు ఉప ఆలయాలకు సైతం రంగులు వేసి సిద్ధం చేశారు. దిగువ కొండగట్టు, దొంగలమర్రి జేఎన్‌టీయూ మార్గంలో స్వాగత తోరణాలు ఏర్పాటు చేశారు. మూడు రోజుల పాటు జరిగే ఉత్సవాలకు రాష్ట్రంలోని వివిధ జిల్లాలతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి లక్షలాది మంది రానున్నారు. ఇప్పటికే కొంత మంది దీక్షాపరులు ఆలయానికి చేరుకున్నారు. నడకమార్గంలో రానుండటంతో వారికి ప్రమాదాలు జరగకుండా రోడ్డు వెంట రేడియం స్టిక్కర్లు, క్యూలైన్ వంటివి ఏర్పాటు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చలువపందిళ్లు, మహిళల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

పర్యవేక్షణకు అధికారులు

అంజన్న సన్నిధిలో జరిగే ఉత్సవాలకు భక్తులకు ఇక్కట్లు కలగకుండా పర్యవేక్షణకు కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా విభాగాలను ఏర్పాటు చేసి అధికారులను నియమించారు. వివిధ శాఖల అధికారులు, ఎంపీవోలతో కో ఆర్డినేటింగ్ ఇన్‌చార్జిలను నియమించారు. ప్రధాన ఆలయం, క్యూలైన్, కొత్త, పాత కోనేరుల వద్ద ఏర్పాట్లు, అన్నదానం, కేశఖండనం, దీక్షమండపం, బేతాళస్వామి



అంజన్న ఆలయం

ఆలయం, ఆలయ కార్యాలయం, సానా గెస్ట్‌హౌస్, పార్కింగ్ ఏరియాలు, మెడికల్ క్యాంప్, వాటర్ పాయింట్స్, వలంటీర్లకు సౌకర్యాలు, రవాణా, విద్యుత్, అగ్నిమాపక రూట్‌మ్యాప్, బందోబస్తు, పారిశుధ్య విభాగాలుగా చేశారు. ఒక్కోదానికి తహసీల్దార్లు, ఆర్డీవోలను ఇన్‌చార్జిలుగా నియమించారు.

సాంస్కృతిక కార్యక్రమాలు

హనుమాన్ పెద్ద జయంతి వేడుకలను పురస్కరించుకుని సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. రోజూ మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు ఆధ్యాత్మికత ఉట్టిపడేలా సాంస్కృతిక ప్రదర్శనలు జరుగనున్నాయి.


స్వామివారికి పోచంపల్లి పట్టు వస్త్రాలు

మల్యాల(చొప్పదండి): కొండగట్టు అంజన్న జయంతి ఉత్సవాల సందర్భంగా స్వామివారికి సమర్పించే పట్టు వస్త్రాలు చేనేత మగ్గంపై తయారు చేసి సిద్ధం చేశారు. వారం క్రితం స్థానిక హరిత హోటల్‌లో చేనేత మగ్గంపై పోచంపల్లి పట్టు వస్త్రాలను తయారు చేయడం ప్రారంభించారు. సికింద్రాబాద్ శ్రీగణపతి ఆలయం ట్రస్టీ రాష్ట్ర పద్మశాలీ సంఘం కార్యదర్శి ఎస్ఎస్.జయరాజు ఆధ్వర్యంలో పట్టువస్త్రాలను గుర్రం శ్రీను, గుర్రం సంతోష్‌కుమార్, జానయ్య, కరుణాకర్, గణేశ్ తయారు చేశారు.

14న హనుమాన్ జయంతి

14న జయంతిని పురస్కరించుకుని ఉదయం 9.30 గంటలకు మూలవిరాట్‌కు పంచామృత అభిషేకం, సహస్ర నాగవల్లి దళ అర్చన, పట్టు వస్త్ర ప్రధానం, 10.30 గంటలకు యాగశాలలో మహాపూర్ణాహుతి, స్నపన తిరుమంజనం, ఉంజల సేవ, మంత్ర పుష్పము, మహానివేదన, తీర్థ ప్రసాద వితరణ, సామూహిక భజన, ఆరాధన, సాయంత్రం 5.30 గంటలకు అమ్మవారి కుంకుమార్చన, ఒడి బియ్యం, సహస్ర దీపాలంకరణ, గరుడ వాహన సేవ, మహదాశీర్వాదము, సామూహిక భజన, తీర్థ ప్రసాద వినియోగ కార్యక్రమాలు నిర్వహించనున్నటు ఆలయ ఫౌండర్ ట్రస్టీ తిరుకోవెళూరు మారుతీస్వామి తెలిపారు.

అక్రమ నిర్మాణాలు చేపడితే చర్యలు



అధికారులతో మాట్లాడుతున్న శ్రీకాంత్‌రావు

జగిత్యాల: ఆలయ భూముల్లో అక్రమ నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని దేవాదాయ శాఖ వరంగల్ జోన్ డెప్యూటీ కమిషనర్ శ్రీకాంత్‌రావు అన్నారు. పట్టణంలోని రాజరాజేశ్వర ఆలయ భూమిలో అక్రమ నిర్మాణాలను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అక్రమ నిర్మాణాలను వెంటనే తొలగించాలని లేకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఈవోలు సద్దయ్య, కాంతరెడ్డి, రవి, భార్గవ్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

అనారోగ్యంతో వ్యక్తి మృతి


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

మల్యాల (చొప్పదండి): మండలంలోని ముత్యంపేట శివారులోని శ్రీ పంచముఖ ఆంజనేయస్వామి ఆలయ పరిసరాల్లో గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందాడు. కొంతకాలంగా పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయంలో స్వీపర్‌గా పనిచేస్తూ, అనారోగ్యంతో మృతిచెందాడని స్థానికులు తెలిపారు. మృతుడి వయస్సు 35–40 సంవత్సరాలు ఉంటుందన్నారు. సర్పంచ్ బద్దం తిరుపతిరెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చిరంజీవి తెలిపారు.

వ్యవసాయ బావిలో పడి బాలుడు..


అజయ్ మృతదేహం

రాయికల్: మండలంలోని ఉప్పుమడుగు గ్రామానికి చెందిన ఏనుమల అజయ్ (10) ప్రమాదవశాత్తు వ్యవసాయ బావిలో పడి మృతిచెందినట్లు గురువారం ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపారు. గ్రామానికి చెందిన ఎనుమల అజయ్ అదే గ్రామానికి చెందిన గరిదాసు నరేశ్‌తో కలిసి గొర్రెలు మేపేందుకు వెళ్లగా చెర్లకొండాపూర్ గ్రామ శివారులోని వ్యవసాయ బావిలోకి చేతులు కడుక్కునేందుకు దిగగా కాలుజారి అందులో మునిగి మృతిచెందాడు. మృతుడి తండ్రి పోశాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చికిత్స పొందుతూ మహిళ..

జగిత్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని ఖిలాగడ్డ ప్రాంతానికి చెందిన సహేని సుల్తానా (30) చికిత్స పొందుతూ గురువారం సాయంత్రం కరీంనగర్‌లో మృతిచెందింది. ఖిలాగడ్డకు చెందిన సహేని సుల్తానా ఈనెల 5న జంబిగద్దె ప్రాంతంలోని తన సోదరి ఇంటికి స్కూటీపై వచ్చి తిరిగి వెళ్తుండగా బైపాస్‌రోడ్‌లో అదుపుతప్పి కిందపడగా తీవ్రగాయాలయ్యాయి. చికిత్స పొందుతూ గురువారం మృతిచెందింది.

మహిళ అదృశ్యం

జగిత్యాల క్రైం: జగిత్యాల రూరల్ మండలం బాలపల్లికి చెందిన మారంపల్లి నర్సవ్వ (52) అదృశ్యమైనట్లు పోలీసులు కేసు నమోదు చేశారు. బాలపల్లికి చెందిన నర్సవ్వ ఈనెల 9న రాత్రి భోజనం చేసి పడుకుంది. వేకువజామున కనిపించకపోవడంతో బంధువులు, స్నేహితుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. ఆమె కుమారుడు మారంపల్లి రాజేందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై శంకరయ్య తెలిపారు.

పెళ్లికి ముందురోజు పరీక్షకు హాజరు


పద్మావతి

కోరుట్ల: పెళ్లికి ఒక్క రోజు ముందు బయటకు వెళ్లడం కష్టమైనప్పటికీ చదువుకోవాలన్న పట్టుదల ఆ అమ్మాయిని పరీక్ష హాల్‌కు నడిపించింది. పెళ్లి కొడుకు సహకారం అందించాడు. పట్టణంలోని అల్లమయ్యగుట్ట చింతవాడకు చెందిన ఈర్నాల పద్మావతి కోరుట్లలో బీఎస్సీ (బీజడ్‌సీ) సెకండియర్ చదువుతోంది. హైదరాబాద్‌కు చెందిన వ్యక్తితో శుక్రవారం మధ్యాహ్నం వివాహం జరగనుంది. మూడు రోజుల ముందుగానే పెళ్లి కూతుర్ని చేయడం వంటి కా ర్యక్రమాలు నిర్వహించారు. గురువారం పరీ క్షకు హాజరైంది. శుక్రవారం కూడా మరో పరీక్ష ఉందని, పెళ్లి కార్యక్రమం ముగియగానే భర్తతో వెళ్లి పరీక్ష రాస్తానని పద్మావతి తెలిపింది.

పోరాడుతారు.. సాధించుకుంటారు


రైతులు నిర్మించుకున్న గోదాం


సహకార సంఘ భవనం

- ఐకమత్యానికి కేరాఫ్ లక్ష్మీపూర్ రైతుల సహకార సంఘం
- రూ. 60 లక్షలతో ఎరువుల గోదాం నిర్మాణం
- నేడు ఎంపీ అర్వింద్, ఎమ్మెల్యే సంజయ్, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభం

జగిత్యాల అగ్రికల్చర్ : ఆ గ్రామంలో రైతులకు సంబంధించి ఏ సమస్య వచ్చినా ఆయా పార్టీల నాయకులు పరిష్కారమయ్యేంత వరకు కలిసికట్టుగా పోరాటం చేస్తారు. ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా జరిగిన పసుపు రైతుల పోరాటంతో పాటు ముత్యంపేట షుగర్ ఫ్యాక్టరీ పునః ప్రారంభించాలని, మొక్కజొన్న, వరి ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలని ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చేందుకు జగిత్యాల రూరల్ మండలం లక్ష్మీపూర్ గ్రామ రైతులు ముందున్నారు.

ఫార్మర్స్ ప్రొడ్యూసర్ కంపెనీగా అవతరణ

లక్ష్మీపూర్ రైతులతో పాటు చుట్టుపక్క గ్రామాలైన గొల్లపల్లి మండలం వెంగళాపూర్, శ్రీరాములపల్లె, నందిపల్లె, జగిత్యాల రూరల్ మండలంలోని జాబితాపూర్, ధర్మారం, పొలాస, రఘురాముల కోట తదితర గ్రామ రైతులతో ముందుగా లక్ష్మీపూర్ పరస్పర సహాయ సహకార సంఘాన్ని ఏర్పాటు చేశారు. దీనికి అనుబంధంగా లక్ష్మీపూర్ ఫార్మర్స్ ప్రొడ్యూసర్ కంపెనీని ఐదారేళ్ల క్రితం ఏర్పాటు చేశారు. రైతులను చైతన్యపర్చడంలో రిటైర్డ్ జిల్లా వ్యవసాయాధికారి దన్నపునేని అశోక్‌కుమార్ కీలకంగా వ్యవహరించారు. ఈ సంస్థలో 600 మంది వరకు రైతులు సభ్యులుగా ఉన్నారు. ప్రతి మూడునెలలు లేదా ఆరు నెలలకోసారి సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేసి సంస్థను ఎలా ముందుకు తీసుకెళ్లాలనే విషయాలపై చర్చిస్తారు. ప్రస్తుతం నాబార్డు, పొలాస వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్తల సహకారంతో ప్రతి సీజన్‌కు ముందు రైతులకు శిక్షణ సమావేశాలు ఏర్పాటు చేస్తున్నారు.

ప్రాసెసింగ్ ప్లాంట్ కోసం గోదాం నిర్మాణం..

ప్రస్తుతం సంస్థ చైర్మన్‌గా ఉన్న పన్నాల తిరుపతి రెడ్డి గోదాంకు అవసరమైన రూ.12 లక్షల విలువ గల 6 గుంటల స్థలాన్ని ఉచితంగా అందజేశారు. నాబార్డు సహకారంతో 1000 మె.ట నిల్వ సామర్థ్యం గల రూ.60 లక్షలతో గోదాం నిర్మించారు. ఒకేసారి 250 లారీల విత్తనాలు, ఎరువులు నిల్వ చేసేలా దీనిని నిర్మించారు. ఈ గోదాంను ఎరువులు, విత్తనాల కోసం వినియోగిస్తుండగా రానున్న రోజుల్లో సీడ్ ప్రాసెసింగ్ ప్లాంట్‌గా తీర్చిదిద్దేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు. గోదాం నిర్మాణానికి ఎంపీ అర్వింద్, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి కొంత నిధులు కేటాయించారు. సంస్థ ద్వారా గతంలో లక్ష్మీపూర్ బ్రాండ్‌తో లక్ష్మీపూర్ రైస్, లక్ష్మీపూర్ సీడ్, లక్ష్మీపూర్ నువ్వులను విత్తనోత్పత్తిగా పండించి, ఇతర గ్రామాల రైతులకు విక్రయించారు. పలు ప్రైవేట్ విత్తన, ఎరువులు, ఫర్టిలైజర్ కంపెనీలతో ఒప్పందం చేసుకొని సంస్థ ద్వారా సభ్యులకు అందిస్తున్నారు.

ప్రతినెలా కార్యవర్గ సమావేశం..

సంస్థ అభివృద్ధికి ప్రతినెలా కార్యవర్గ సమావేశం నిర్వహిస్తారు. సమావేశానికి ఏ డైరెక్టర్ హాజరుకాకున్నా రూ.500 జరిమానా విధిస్తారు. ఆదాయ, వ్యయాలతో పాటు సంస్థ అభివృద్ధికి చేయాల్సిన పనులపై చర్చిస్తారు. ప్రతి ఆర్థిక సంవత్సరంలో రూ.కోటికి పైగా వ్యాపారం చేస్తూ, ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోనే లక్ష్మీపూర్ ఫార్మర్స్ ప్రొడ్యూసర్ సంస్థ ముందు వరుసలో ఉంది. రైతులు సాగుచేసే పసుపు, పండ్ల తోటలను సందర్శించేందుకు పొలాస వ్యవసాయ విద్యార్థులతో ఇతర గ్రామాల రైతులు సందర్శనకు వస్తుంటారు.

నేడు ప్రారంభోత్సవం..

లక్ష్మీపూర్ రైతులు నిర్మించిన గోదాంను ఎంపీ అర్వింద్‌తో పాటు ఎమ్మెల్యే సంజయ్, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి శుక్రవారం ప్రారంభించనున్నారు. గోదాంకు అదనంగా నిర్మిస్తున్న కార్యాలయ భవనానికి సైతం శంకుస్థాపన చేయనున్నారు.

రైతుల సహకారంతో అభివృద్ధి



రైతుల సహకారంతోనే సంస్థ అభివృద్ధి జరుగుతుంది. విత్తనాలు, బియ్యం, నువ్వుల అమ్మకంలో లక్ష్మీపూర్‌కు బ్రాండ్ తీసుకువచ్చాం. జిల్లాలో వరి ఎక్కువగా సాగు చేస్తున్నందున సీడ్ ప్రాసెసింగ్ ప్లాంట్ ఏర్పాటు చేసి నాణ్యమైన విత్తనాలను రైతులకు అందించాలని నిర్ణయించాం.

– పన్నాల తిరుపతి రెడ్డి, చైర్మన్, ఫార్మర్స్ ప్రొడ్యూసర్ సంస్థ, లక్ష్మీపూర్

పదోతరగతి ఫలితాల్లో 'ట్రినిటీ' సత్తా


విజయసంకేతం చూపుతున్న చైర్మన్ ప్రశాంత్‌రెడ్డి, విద్యార్థులు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లిలోని ట్రినిటీ పాఠశాల విద్యార్థులు పదోతరగతి ఫలితాల్లో వందశాతం ఉత్తీర్ణతతో సత్తా చాటారు. రిషి, శశికాంత్, సూర్యతేజ, విజయ్‌కుమార్, అశ్విత, హరిణి, హిమాని, మల్లిక, మనస్విని, నాగజ్యోతిక, సహస్ర, సాయి, అక్షయ్, సాయిహర్షిణి, సంజన తదితర 32 మంది విద్యార్థులు 10 జీపీఏ సాధించారని విద్యాసంస్థల చైర్మన్ దాసరి ప్రశాంత్‌రెడ్డి తెలిపారు. 33 మంది 9.8 జీపీఏ, 46 మంది 9.7, 33 మంది 9.5, 40 మంది 9.3, 38 మంది 9.2, 23 మంది 9 జీపీఏ సాధించారన్నారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను గురువారం ఆయన అభినందించారు. ఉపాధ్యాయుల ఉత్తమ బోధనతో ఏటా రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధిస్తున్నామని పేర్కొన్నారు. ప్రిన్సిపాల్ రమేశ్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

'సిద్ధార్థ' విద్యార్థుల విజయకేతనం


అత్యధిక గ్రేడ్ పాయింట్లు సాధించిన విద్యార్థులతో డైరెక్టర్ శ్రీపాల్‌రెడ్డి

సప్తగిరికాలనీ(కరీంనగర్): పదోతరగతి ఫలితాల్లో కరీంనగర్‌లోని సిద్ధార్థ విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారు. అత్యుత్తమ జీపీఏ గ్రేడ్ పాయింట్లు సాధించినట్లు విద్యాసంస్థల డైరెక్టర్ దాసరి శ్రీపాల్ రెడ్డి తెలిపారు. 11 మంది 10 జీపీఏ, 14 మంది 9.8 జీపీఏ, 21 మంది 9.7 జీపీఏ, 125 మంది 9.0, ఆపైన జీపీఏ సాధించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా గురువారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులను ఆయనతోపాటు ప్రిన్సిపాళ్లు, వైస్ ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయులు అభినందించారు. తమ విద్యాసంస్థల నుంచి మొత్తం 238 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవగా 99 శాతం మంది ఉత్తీర్ణులయ్యారని తెలిపారు.

రైతులు ఆందోళన చెందొద్దు

- ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు


కొనుగోళ్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు

మెట్‌పల్లి(కోరుట్ల): తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, ఈ విషయంలో రైతులు ఆందోళన చెందవద్దని ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు పేర్కొన్నారు. పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం ప్రారంభించి మాట్లాడారు. అకాల వర్షాలతో చాలా చోట్ల ధాన్యం తడిసిందని, రైతులకు నష్టం జరుగకుండా దానిని కొనుగోలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. పంట నష్టం గురించి అధికారులు నివేదికలు రూపొందిస్తున్నారని, ఈ విషయంలో కూడా ప్రభుత్వం రైతులను ఆదుకుంటుందన్నారు. రైతుల సంక్షేమానికి బీఆర్ఎస్ అధిక ప్రాధాన్యం ఇస్తుందని, ప్రతిపక్షాల మాటలు నమ్మవద్దన్నారు. కార్యక్రమంలో ప్యాక్స్ చైర్మన్ తీగల లింగారెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ రాణవేని సుజాత, ఎంపీపీ మారు సాయిరెడ్డి, మార్కెట్ ఇన్‌చార్జి కార్యదర్శి రమణ, డైరెక్టర్లు పాల్గొన్నారు.

రాష్ట్రానికి కేసీఆర్ చీడలా దాపురించాడు

- ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

జగిత్యాలరూరల్: కాంగ్రెస్ గెలుపులో యూత్ కాంగ్రెస్ పాత్ర కీలకమని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని దేవిశ్రీ గార్డెన్స్‌లో యూత్ జోడో బూత్ జోడో నినాదంతో బూత్‌స్థాయి కార్యకర్తల శిక్షణ కార్యక్రమం జిల్లా యూత్ అధ్యక్షుడు గుండ మధు ఆధ్వర్యంలో నిర్వహించగా ఎమ్మెల్సీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సీఎం కేసీఆర్ రాష్ట్రానికి చీడపురుగులా దాపురించాడని, దేశ రాజకీయాల్లో కేసీఆర్‌ను మించిన అవకాశవాది లేడన్నారు. కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకువచ్చేందుకు ప్రతి కార్యకర్త సైనికుల్లా పనిచేయాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలను ఎత్తిచూపుతూ ప్రజల్లోకెళ్లాలని సూచించారు. రానున్న రోజుల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ జెండా ఎగురవేయడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. బీజేపీ మతవిద్వేషాలను రెచ్చగొడుతూ పబ్బం గడుపుకుంటుందని, మత ప్రాతిపదికన కాకుండా సామాజిక, వెనుకబాటుతనం ఆధారంగా రిజర్వేషన్లు కల్పించాలని గుర్తుచేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే నిరుద్యోగ యువతకు ఆత్మస్థైర్యం కల్పించేందుకు నెలకు రూ.4 వేల భృతి చెల్లిస్తామన్నారు. 2 లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తామని కాంగ్రెస్ మెనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పేర్కొన్నారు. అనంతరం ప్రి యాంకగాంధీ విడుదల చేసిన మెనిఫెస్టో పోస్టర్ ఆ విష్కరించారు. యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనరెడ్డి, ఏఐసీసీ సెక్రటరీ సురబి అర్పిత శ్రీనివాస్, గిరి నాగభూషణం, బండ శంకర్, కృష్ణారావు, తాటిపర్తి విజయలక్ష్మీ, చాంద్ పాషా, కండ్లపల్లి దుర్గయ్య, మసూర్‌అలీ, సింహరాజు ప్రసాద్, మహిపాల్, శంకర్ పాల్గొన్నారు.

ఇథనాల్ పరిశ్రమతో సమీప గ్రామాలకు ముప్పు

- పర్లపల్లిలో పరిశ్రమను సందర్శించిన నాలుగు గ్రామాల ప్రజలు


పర్లపల్లి పరిశ్రమ వద్ద నాలుగు గ్రామాల ప్రజలు

వెల్గటూర్(ధర్మపురి): ఇథనాల్ పరిశ్రమ ఏర్పాటుతో చుట్టు పక్కల 10 కిలోమీటర్ల మేర ఉన్న గ్రామాలకు ముప్పు వాటిల్లుతుందని పర్లపల్లి గామస్తులు అన్నారు. కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం పర్లపల్లిలోని ఇథనాల్ పరిశ్రమను శుక్రవారం పాశిగామ, స్తంభంపల్లి, వెంకటాపూర్, వెల్గటూర్ గ్రామాలకు చెందిన సుమారు వంద మంది సందర్శించారు. పరిశ్రమ వల్ల లాభాలు, నష్టాలు, దుష్పరిణామాలు, అక్కడి పరిస్థితులు ఎలా ఉన్నాయి అని పర్లపల్లి గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్శనలో పర్లపల్లి గ్రామస్తులు సంచలన విషయాలు చెప్పారు. ఎంతో మందికి ఉద్యోగాలు లభిస్తాయని ఆశపడి పరిశ్రమ ఏర్పాటుకు గ్రామ పంచాయతీ ద్వారా అనుమతులు ఇచ్చామని, కానీ ఎవరికీ ఉద్యోగాలు ఇవ్వలేదన్నారు. పరిశ్రమ నుంచి వెలువడే దుర్గంధం చాలా దారుణంగా ఉంటుందని, వర్షాకాలం దీని తీవ్రత ఎక్కువగా ఉంటుందని వివరించారు. గాలి, నీరు, భూగర్భ జలాలు కలుషితం అవుతాయని, పండే పంటలపై తీవ్ర ప్రభావం ఉంటుందని వాపోయారు. చర్మంపై దద్దుర్లు, దురద, శ్వాసకోశ సమస్యలు, గర్భాధారణ సమస్యలు, పుట్టే పిల్లలపై కూడా అనేక దుష్ప్రభావాలు ఉంటాయని పేర్కొన్నారు. అప్పుడు పరిశ్రమ వద్దంటూ ఉద్యమాలు చేసినా కమీషన్లకు ఆశపడి కొందరు నాయకులు చేసిన పనితో ఇప్పుడు వేల మంది బాధపడుతున్నారని తెలిపారు. ఈక్రమంలో వెల్గటూర్ మండలం స్థంభంపల్లి శివారులో పరిశ్రమ ఏర్పాటు చేస్తే గ్రామాలన్నీ ఎడారిగా మారుతాయని, ఈ ప్రాంతంలో బతికి బట్టకట్టే పరిస్థితి లేదని నాలుగు గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు.

నేడు కలెక్టర్ పర్యటన

స్థంభంపల్లి శివారులో ఏర్పాటు చేయనున్న ఇథనాల్ పరిశ్రమకు వ్యతిరేకంగా 40 రోజులుగా పాశిగామ, స్థంభంపల్లి గ్రామస్తులు ఆందోళన చేస్తున్న క్రమంలో శుక్రవారం సదరు గ్రామాల్లో కలెక్టర్ యాస్మిన్ బాషా పర్యటించనున్నారు. పరిశ్రమకు సంబంధించి కలెక్టర్ ఆధ్వర్యంలో నిపుణుల ద్వారా గ్రామస్తులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటుచేశారు. ఉదయం 10 గంటలకు స్థంభంపల్లి, మధ్యాహ్నం 2 గంటల సమయంలో పాశిగామలో పర్యటించి ఆయా గ్రామస్తుల అభిప్రాయాలు తెలుసుకుంటారు. ఈ కార్యక్రమానికి ప్రజలు హాజరై అనుమానాలను నివృత్తి చేసుకోవాలని కలెక్టర్ ప్రకటనలో తెలిపారు.

పంట నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలి


రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

మేడిపెల్లి(వేములవాడ): అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ డిమాండ్ చేశారు. గురువారం బీమారం మండలం దమ్మన్నపేట్ గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి రైతుల సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించడంతో పాటు తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలన్నారు. రైతులను ఆదుకుంటామని చెబుతున్న బీఆర్ఎస్ ప్రభుత్వం మాటల్లో తప్ప చేతల్లో లేదని దుయ్యబట్టారు. అనంతరం బీమారం మండల కేంద్రంలోని పెద్దమ్మ ఆలయంలో బోనాల కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకురాలు తుల ఉమ, బోంగోని రాజగౌడ్, బాలసాని మారుతి తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ వేలం

జగిత్యాల: టీఎస్ఆర్టీసీ జగిత్యాల లాజిస్టిక్ కార్గో సర్వీస్‌లో వినియోగదారులకు వచ్చిన వివిధ పార్సిల్స్ 40 రోజుల పైబడి తీసుకెళ్లని వస్తువులకు బహిరంగ వేలం వేయనున్నట్లు డిపో మేనేజర్ వెంకటప్ప తెలిపారు. ఆసక్తి గలవారు శనివారం ఉదయం 11 గంటలకు జగిత్యాల ఆర్టీసీ డిపోలో పాల్గొనాలన్నారు.

'మాతా శిశు'లో శిశువు మృతి

- వైద్యుల నిర్లక్ష్యంతోనేనంటూ బంధువుల ఆందోళన


ఆందోళన చేస్తున్న బంధువులు

జగిత్యాల : జిల్లా కేంద్రంలోని మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో శిశువు మృతిచెందగా వైద్యుల నిర్లక్ష్యంతోనేనంటూ బంధువులు ఆందోళన చేపట్టారు. వివరాల్లోకి వెళితే.. గంగాధర మండలం మల్లాపూర్‌కు చెందిన శేఖర్ తన భార్య జమునను డెలివరీ కోసం బుధవారం మాతా శిశు కేంద్రంలో చేర్పించాడు. సిజేరియన్ చేస్తే ఇబ్బందులవుతాయని వైద్యులు నార్మల్ డెలివరీ కోసం చూశారు. బీపీ పెరగడంతో శిశువు మృతిచెందింది. కాగా వైద్యుల నిర్లక్ష్యతోనే శిశువు మృతిచెందినట్లు ఆస్పత్రి ఎదుట ఆందోళన చేశారు. సూపరింటెండెంట్ రాములు మాట్లాడుతూ.. డెలివరికి సమయం ఉంది. ఈలోపే బీపీ పెరగడంతో శిశువు మృతిచెందిందని, వైద్యుల నిర్లక్ష్యం లేదని తెలిపారు.

బీజేపీ నాయకుల మద్దతు..

ఆస్పత్రి ఎదుట బంధువులు ఆందోళన చేపట్టగా వారికి బీజేపీ నాయకులు మద్దతు తెలిపారు. పోలీసు ఆస్పత్రికి చేరుకొని ఆందోళనను విరమింపజేశారు. ఫిర్యాదు చేస్తే విచారణ చేపడతామన్నారు. బీజేపీ నాయకులు పన్నాల తిరుపతి రెడ్డి, మదన్‌మోహన్, దీటి వెంకటేశ్, సామల సతీశ్, మోహన్‌రెడ్డి, సతీశ్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆలయాల్లో మహిళా కమిషన్ చైర్మన్ పూజలు


స్వామివారి ప్రసాదం అందజేస్తున్న ఈవో

ధర్మపురి/వెల్గటూర్: ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి, వెలగటూ ర్ మండలంలోని కోటిలింగాల కోటేశ్వరస్వామిని గురువారం తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ చైర్మన్ సునీతా లక్ష్మారెడ్డితో పాటు ఆరుగురు సభ్యులు దర్శించుకున్నారు. ఆలయ ఈవో శ్రీనివాస్ ఆధ్వర్యంలో పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ప్రధాన, అనుబంధ ఆలయల్లో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఈవో స్వామివారి శేషవస్త్రం, ప్రసాదం అందజేశారు. రేనవేషన్ కమిటీ స భ్యులు, వేదపండితులు బొజ్జ రమేశ్‌శర్మ, సూపరింటెండెంట్ కిరణ్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ అలువాలు శ్రీనివాస్ తదితరులున్నారు. కోటేశ్వరస్వామి దర్శనం అనంతరం సునీతాలక్ష్మారెడ్డిని వెల్గటూ ర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పత్తిపాక వెంకటేశ్ శాలువాతో సన్మానించారు. మహిళా కమిషన్ సభ్యులు ఈశ్వరీబాయి, రేవతి రావు, లక్ష్మి, అర్చకులు నాగరాజు శర్మ, సంజీవ్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

దొంగను పట్టుకున్న స్థానికులు

జగిత్యాల క్రైం : జిల్లా కేంద్రంలోని పాతబస్టాండ్‌లో ప్రయాణికుడి నుంచి పర్సు చోరీ చేసిన దొంగను స్థానికులు పట్టుకొని పోలీసులకు అప్పగించారు. మంచిర్యాల జిల్లా జన్నారం మండలం చింతగూడ గ్రామానికి చెందిన భూక్య నర్సింగ్ జిల్లా కేంద్రంలోని ఓ వ్యక్తి వద్ద పనిచేస్తున్నాడు. గురువారం యజమాని వద్ద రూ.5 వేలు తీసుకుని ఇంటికి వెళ్తుండగా పాతబస్టాండ్‌లో బస్సు ఎక్కుతున్న సమయంలో రామడుగు మండల కేంద్రానికి చెందిన గణేశ్ అలియాస్ రాము అనే వ్యక్తి జేబులోంచి పర్సు కొట్టేశాడు. అందులోంచి రూ.5 వేలు వెంట వచ్చిన మరో వ్యక్తికి ఇచ్చాడు. ఇతన్ని పట్టుకునే లోపే మరో వ్యక్తి పరారయ్యాడు. దీంతో జేబుదొంగను పోలీసులకు అప్పగించారు.

13న ఓపెన్ ఇంటర్ పరీక్ష

జగిత్యాల: జిల్లాలో ఓపెన్ ఇంటర్ పబ్లిక్ పరీక్షలు ఏప్రిల్ 25 నుంచి మే 4 వరకు నిర్వహించడం జరిగిందని, మే 2న అర్థశాస్త్రం ఎకానమిక్స్ తెలుగు మీడియం పరీక్ష రద్దు కాగా, ఈనెల 13న నిర్వహించనున్నట్లు డీఈవో జగన్మోహన్‌రెడ్డి తెలిపారు. ఇప్పటి వరకు పరీక్షలు జరిగిన కేంద్రాల్లోనే అర్థశాస్త్రం పరీక్ష నిర్వహించడం జరుగుతుందని, అభ్యసన కేంద్రాల ఆల్ కో ఆర్డినేటర్లు విధిగా హాజరు కావాలన్నారు. ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు 12 నుంచి 19 వరకు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందన్నారు.

ఉద్యోగ అవకాశాలు

జగిత్యాల: జిల్లాలోని గ్రామీణ ప్రాంతాలకు చెందిన నిరుద్యోగ యువతీ, యువకులకు బిగ్‌బాస్కెట్ హైదరాబాద్‌లో ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని డీఆర్డీఏ పీడీ లక్ష్మీనారాయణ తెలిపారు. బిగ్‌బాస్కెట్ కంపెనీలో డెలివరీ ఎగ్జిక్యూటీవ్ ఉద్యోగాలు 50, ప్యాకింగ్ ఎగ్జిక్యూటీవ్‌లు 30 ఉన్నాయని ఆసక్తిగల వారు ఈనెల 16న బయోడెటా, ఆధార్‌కార్డు, విద్యార్హతల జిరాక్స్‌లతో జిల్లా సమైక్య కార్యాలయంలో జరిగే ఇంటర్వ్యూలకు హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాలకు 62812 92787 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.